అక్టోబరు నెలలో బదిలీ వచ్చింది. పెట్టే, బేడా పట్టుకుని భార్యాపిల్లల్ని తీసుకుని ఊరు మారేను.

కొత్త ఊరో పెద్ద టౌను. అయినప్పటికీ ఇల్లూ, గేస్ కనెక్షన్, రేషన్ కార్డు వగైరాలు తేలిగ్గానే అమిరాయి. ఆ తర్వాత మా బాబి గాణ్ని చేర్చడానికి స్కూలు వేటలో పడ్డాం. టౌన్లో బాగా పేరున్న ఆ కాన్వెంటు స్కూల్లోనే చేర్చమని సలహా ఇచ్చారు ఆఫీసు వాళ్లు. అందులో సీటు దొరకటం చాలా కష్ట మన్నారు కొందరు. సీటు దొరికితే మీరు నక్కని తొక్కి వచ్చినట్టే అనేశా రింకొందరు.

# చదువు

## సింహాప్రసాద్

ఎందుకైనా మంచిదని మా ఆడిటర్తో సిఫార్సు చేయించేను. మాట్లాడేననీ, వెళ్లి కలవమనీ చెప్పే డాయన.

మా బాబిగాణ్ని తీసుకుని వెళ్లేం నేనూ, మా ఆవిడా. వాళ్లడిగే ప్రశ్నలకి ధైర్యంగా జవాబు లిమ్మని దారి పొడవునా నూరి పోస్తూనే వుంది మా ఆవిడ.

ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉందా కాన్వెంటు. పదెకరాల స్థలం, పెద్ద పెద్ద భవనాలు, ప్రహారీ గోడ - చాలా ఖాళీగా ఉంది స్కూలు.

స్కూటర్ని గేటు బయటే పార్కు చేసి లోపలో ఫర్లాంగు దూరం నడిచి ఆఫీసు రూం లోకెళ్లాం.

హోటల్లోని రిసెప్షన్ కౌంటర్లాంటి కౌంటర్లో ఒకామె కూర్చునుంది. మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి కుర్చీలు చూపించింది.

నా విజిటింగ్ కార్డు ఇచ్చి "కరెస్పాండెంట్ని కలవాలి" అన్నాను.

కార్డుని లోపలికి పంపించింది. ఓ పది నిముషాలకు ఇంటర్ కమ్ మోగింది. రిసీవరెత్తి మాట్లాడి, "మీరే పని మీద వచ్చార్సార్?" అనడిగింది నన్ను.

"మా అబ్బాయిని మీ స్కూల్లో చేర్పిద్దామని ..."

"మిడ్ అకడెమిక్ ఇయర్లో చేర్చుకోం సార్."

"మా ఆడిటర్ మాట్లాడారు. రమ్మని చెప్పేరని చెప్పండి."

ఆమె చెప్పి రిసీవర్ పెట్టేసింది.

"జోళ్లు తీసేసి లోపలి కెళ్లండి సార్" దారి చూపించింది.

ఏసీ రూంలో అడుగు పెట్టాం. సఫారీ సూట్లో ఉన్నారు నలభైఅయిదేళ్ల కరస్పాండెంట్. విష్ చేశాను.

"మిస్టర్ సుబ్బరావ్ చెప్పేరు. కాని మిడ్ ఇయర్లో చేర్చుకోం. అది మా పోలసీ."

"మావి బదిలీలయ్యే ఉద్యోగాలు. మాలాటి వారి క్కొంచెం కన్సెషన్ ఇవ్వాలి" అని నేనంటే,

"మీ స్కూలు గురించి చాలా గొప్పగా విని ఇక్కడే చేర్చా లనొచ్చాం" అంది మా ఆవిడ.

మా బాబిగాడు బిక్కుబిక్కు మంటూ చూశాడు.

"మేం స్టేండర్డ్ మెయిన్టెయిన్ చేస్తాం. యూనో, టెన్త్లో మాది హండ్రడ్ పర్సెంట్ పాస్. ఎయిటీ పర్సెంట్ ఫస్ట్ క్లాస్. సరే.. మీ సన్ను టెస్ట్ చేస్తారు. రిపోర్టొచ్చేక ఆలోచిస్తాను."

ఇంటర్కమ్లో ఎవర్నో పిలవగా ఒకావి డొచ్చి మా వాణ్ని పక్క రూంలోకి తీసుకెళ్లింది.

బితుకుబితుకు మంటూ వెళ్లేడు వాడు.

"ఎంట్రన్స్ టెస్ట్ రోజు హండ్రెడ్ రూపీస్ ఆఫీసులో కట్టేసి లాంజ్లో కూర్చోండి."

బయటి కొచ్చి రిసెప్షనిస్ట్ దగ్గర కూర్చున్నాం. గంటయ్యిం ది. బాబిగాడు రాలేదు. ఇంత సేపు ఏమేం పరీక్షలు నిర్వహించేస్తున్నారో అర్థం కాలేదు. నా కంటే మా ఆవిడకి మరీ టెన్షన్గా ఉంది.

మరో అర గంటకు వచ్చాడు. తడిపి పిండిన బట్టలా ఉన్నాడు.

"ఏవిరా కన్నా?" ఎదురెళ్లి కర్చీఫ్తో వాడి ముఖం తుడిచింది మా ఆవిడ.

"మీరు వెళ్లొచ్చు. రిజల్ట్ రేపు నోటీసు బోర్డులో పెడతాం."

నివ్వెరపోయాం. "ఏదో మెడిసిన్ సీటు ఇస్తున్నట్టుగా మాట్లాడుతున్నారే! కరెస్పాండెంటును కలుస్తాం."

"ఇప్పుడు కుదరదు సార్."

"ఏం? ఆయన ఐఏస్సా?"

"అబ్బే, అండర్ గ్రాడ్యుయేట్..." గబుక్కున అనేసి నాలి క్కరుచుకుంది.

ఆవిడ ఇంటర్కమ్లో కంగారుగా మాట్లాడి పరుగున వెనకనే వచ్చి "జోళ్లు తీసేసి వెళ్లండి సార్" అంది.

అలా చేసి వెళ్లాం.

'రిపోర్టొచ్చింది. మీ సన్ పెర్ఫామెన్స్ వెరీ పూర్. ఏం బావో లేదు. రీడింగ్ ఓకే. కాని ప్రొనౌన్సియేషన్ బిలో యావరేజ్. రైటింగ్ జస్ట్ యేవరేజ్. జీకే ఓకే. తెలుగు యావరేజ్. ఇంగ్లీష్ గ్రాస్పింగ్ పూర్. బొత్తిగా స్టేండర్డ్ లేదు!' పెదవి విరిచేశాడు!

మా ముఖాలు నల్లగా మాడి పోయాయి. బాబిగాడి ముఖం ఎలా ఉందో గాని వాడి వంక చూసే ధైర్యం లేక పోయింది. కానొక్కటి. మా వాడి స్టేండర్డ్ ఆయన చెప్పినట్టు దారుణంగా లేదని కచ్చితంగా చెప్పగలను. వాడు మెరిట్ స్టూడెంట్. మంచి ఐక్యూ ఉంది. ఒకటి రెండు కప్పుల్ని కూడా తెచ్చుకున్నాడు. వాడి టీచర్లంతా పొగిడిన వారే. అలాటి దీయన...?


"కొత్త కదా కంగారు పడి ఉంటాడు. మొదట్నుంచీ కూడా ఫస్ట్ ఆర్ సెకండ్ రాంక్ తెచ్చుకుంటున్నాడు" మా ఆవిడ అంది.

"వీధి కో స్కూలూ, రోడ్డుకో కాన్వెంటూ ఉంటున్నాయి. వాటిల్లో రావొచ్చు. కాని మా స్కూల్ స్టేండర్డ్కు సరిపోడు!"

మా ఆవిడకు రోషం పొడుచుకొచ్చింది. 'చూడండి! మా వారు ఆఫీసర్. మేం ఇద్దరం పోస్టు గ్రాడ్యుయేట్సుము. మేం ఇంత క్రితం ఉన్న ఊళ్లోని బెస్ట్ స్కూల్లో చదివాడు. ఉన్నంతలో బెస్ట్ ఎడ్యుకేషన్ ఇవ్వాలనే మా తాపత్రయం తప్ప ఏదో వాన కాలపు చదువు చదివించాలని మేం అనుకోవట్లేదు!'

"అఫ్ కోర్స్, ఆ ఊరి కదే ఆముదపు మహావృక్షం కావచ్చు" నవ్వేడతను.

నాకు ఒళ్లు మండింది. అయినా నిగ్రహించుకున్నాను. "చేర్చుకుని చూడండి. మీ స్టేండర్డ్ అందుకోలేక పోతే అప్పుడు తీసుకెళ్లి



పోతాం."

"మిస్టర్ సుబ్బరావ్ చెప్పేరు గనుక ఓకే. చూద్దాం" అని ఇంటర్‌కమ్‌లో ఏదో చెప్పగా ఒకావిడ ఓ స్లిప్ తెచ్చిచ్చింది.

కట్టాల్సిన ఫీజు వివరాలు చూసి ప్రాన్పడి పోయాను!

అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్పెషల్ ఫీజు, రెండు టరముల ఫీజు, జూన్ నుంచి వేన్ ఫీజు వెరసి 8500 కట్టాలిట!

"ఫస్ట్ టరమ్ ఇక్కడ చదవక పోయినా ఫీజు కట్టాలా?"

"ఎప్పుడు చేరినా ఇయర్ ఫీజు మొత్తం కట్టాల్సిందే. అసలు మీకు సీటు ఇవ్వటమే గొప్ప. మీ కుర్రాడిది బిలో స్టేండర్డ్. రికమెండేషన్ వల్ల గాని, లేక పోతే అడ్మిష నివ్వను. రోడ్డు మీద నిలబెట్టి చదివించినట్టుంది స్టేండర్డ్!"

నేనిహ నా కోపాన్ని అదుపు చేసుకోలేక పోయాను.

"ప్లీజ్ హోల్డ్ యువర్ టంగ్! నేను మిమ్మల్ని ఇంజనీరింగు సీటో, మెడిసిన్ సీటో ఇమ్మనటం లేదు. కేవలం రెండో క్లాసులో సీటిమ్మన్నాను. దాని కెంత ఆర్భాటం చేస్తున్నారు! ప్రతిభను ప్రోత్సహించటం కాదు, అసలు గుర్తించటమే మీకు తెలీదని నాకు అర్థ మైంది. ఫీజులు స్కూలు స్టేండర్డ్‌కు కొలబద్ద కాదన్న సంగతి తెలుసుకోండి. మా వాడికి చదువు రాకపోయినా పర్లేదు కాని ఇలాంటి స్కూల్లోని చదువొద్దు! ఈ కుసంస్కార వ్యాపార పటాటోపాలూ వద్దు! మీకూ, మీ సీటుకూ, మీ స్కూలుకూ ఓ నమస్కారం!"

స్లిప్ అతడి మీదికి విసిరేసి వచ్చేశాం.

P